సాక్షి
చిత్తూరు

బుధవారం । 14 । ఆగస్టు । 2024



రూ.5 కోట్లు కట్టు.. ఇసుక కొల్లగొట్టు!

ప్రజా ప్రతిని ధులే కాసులకు కక్కుర్తి పడి ఇసుక దోపిడీతో జేబులు నింపుకుంటున్నారు. - 8లో



నష్టం మిగిల్చిన భారీ వర్షం

భారీ వర్షం పలువురికీ నష్టాలను మిగిల్చింది. ఇళ్లే కాకుండా పంటలు కూడా దెబ్బతిన్నాయి. - 8లో



జేసీకి వీడ్కోలు సన్మానం

బదిలీపై గుంటూరుకు వెళ్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

కలెక్టరే జేసీగా అదనపు బాధ్యతలు

చిత్తూరు కలెక్టరేట్ : జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గుంటూరు నగరపాలక కమిషనర్‌గా బదిలీ అయి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం కొత్త జేసీని ఇంకనూ నియమించలేదు. నూతన జేసీని నియమించే వరకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ జేసీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలే ముఖ్యం

డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వడమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం సీహెచ్‌ఓ, ఎంఎల్‌పీహెచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, క్వాలిటీ అస్యూరెన్స్‌కు అర్హత కలిగిన ఆరోగ్య ఉపకేంద్రాలను గుర్తించాలన్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం శిక్షణాధికారి నిరంజన్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎంఓ హర్షవర్ధన్‌రెడ్డి, క్వాలిటీ మేనేజర్ దివ్య పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాకు 'పంక్చర్'

అనూహ్యంగా పట్టుబడిన తమిళనాడు బియ్యం పోలీస్ స్టేషన్‌కు కంటైనర్ లారీ తరలింపు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం కంటైనర్

కుప్పం: తమిళనాడు నుంచి కుప్పం మీదుగా కర్ణాటకకు అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న కంటైనర్ లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..మంగళవారం ఉదయం కుప్పం పట్టణం వద్ద పలమనేరు జాతీయ రహదారిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద పంక్చరై కంటైనర్ లారీ ఆగిపోయింది. వాహనంలో ఎవరూ లేకపోవడంతో దానిని గమనించిన స్థానికులు బియ్యం లోడుతో ఉన్నట్టు గుర్తించి పోలీసులు, మీడియాకు సమాచారం ఇచ్చారు. కుప్పం అర్బన్ సీఐ జిటి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనంలో తమిళనాడులో చౌక దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం దాదాపు 10 టన్నుల వరకూ ఉన్నట్టు గుర్తించారు. నిత్యం పదుల సంఖ్యలో లారీలు, టెంపోలతో కుప్పం మీదుగా బియ్యం అక్రమ రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలో చంద్రబాబునాయుడు విపక్షంలో ఉండగా తమిళనాడు నుంచి బియ్యం స్మగ్లింగ్‌పై అక్కడి ప్రభుత్వానికి లేఖ రాసి అక్రమ రవాణాను అరికట్టారు. కానీ ఇప్పుడు ఆయనే అధికారంలో ఉన్నా, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం మీదుగా సాగుతున్న బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,728 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,611 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా 468 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

ప్రాణవాయువా.. ప్రణామం..!


ఆ చిత్తూరులో ఏముంది..? చుట్టూ నాలుగు కొండలు తప్ప. ఇక్కడ ఓ కేంద్ర విశ్వవిద్యాలయం లేదు. ప్రభుత్వ వైద్య కళాశాల లేదు. అంటూ నిట్టూర్చేవారికి చిత్తూరు వాసులు గర్వంగా సమాధానం చెప్పేరోజు రానే వచ్చింది. చిత్తూరు నగరంలో ఉంటున్న గాలిలో ప్రాణవాయువు (ఆక్సిజన్) శాతం మెండుగా ఉందని తలెత్తుకునేలా చెప్పొచ్చు. గాలి కాలుష్యం తక్కువగా ఉండే నగరాల జాబితాలో చిత్తూరుకు స్థానం లభించింది. గతంలో పోలిస్తే గాలిలో పీఎం-10 స్థాయి చిత్తూరులో 59 ఉండటం కాలుష్యం తగ్గినట్లుగా కేంద్రం భావిస్తోంది. కాలుష్య కారకాలు అత్యధికంగా వెలువడే నగరాల్లో విశాఖ 30వ స్థానంలో ఉంటే చిత్తూరు 116వ స్థానంలో ఉండటం కాస్త ఉపశమనం కలిగించే విషయమే.

- చిత్తూరులో పెరుగుతున్న స్వచ్ఛ గాలి పరిమాణం
- ఎన్-క్యాప్ ర్యాంకుల్లో తగ్గిన వాయు కాలుష్య ఉద్గారాలు
- గాల్లో పెరుగుతున్న ఆక్సిజన్ శాతం
- చుట్టూ ఉన్న వృక్ష సంపదే 'అదృష్ట' కారణం

చిత్తూరు అర్బన్: భూతాపం (కాలుష్యం కారణంగా భూమి వేడెక్కడం)నేపథ్యంలో ప్రపంచంలో ప్రాణులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ దొరకడం కష్టంగా మారిపోయింది. పంచభూతాలుగా పిలవబడే నింగి, నేల, నీరు, గాలి, నిప్పు..ఇలా అన్నీ కలుషితమై పోతున్నాయి. అయితే వీటిల్లో అన్నింటికంటే ప్రాణులకు ఆక్సిజన్ ప్రధానం. ఇటీవల పెరుగుతున్న పట్టణీకరణ, ట్రాఫిక్ సమస్య వల్ల వాహనాలు ఓచోట ఆగినపుడు ఇంజిన్ ఆఫ్ చేయకపోవడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదల కావడం, అడవులు తగలబడిపోవడం జరుగుతోంది. వీటి నుంచి వెలువడే పొగ, పరిశ్రమల్లో బొగ్గు కాల్చడం ద్వారా విడుదలయ్యే ఉద్గారాల వల్ల మనం పీలుస్తున్న గాలిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న పట్టణాలు, నగరాల్లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్-కాప్) కింద దేశంలోని 131 పట్టణాల్లో గాలిలో వాయు కాలుష్య ఉద్గారాలు తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో చిత్తూరును గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలకు ఎన్-కాప్ రంగంలోకి దిగింది.

సత్ఫలితాలు

2025-26 నాటికి చిత్తూరులో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని ఎన్-కాప్ లక్ష్యంగా పెట్టుకుంది. 2022లో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అభ్యర్థన మేరకు మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.6 కోట్ల వరకు కేంద్రం నిధులు కేటాయించింది. ఎన్-కాప్ కింద చిత్తూరుకు దాదాపు రూ.6 కోట్ల నిధులు విడుదల చేసింది. నగర ప్రధాన కూడళ్లల్లో పచ్చదనం పెంపునకు దృష్టి సారించి, ఆక్సిజన్ స్థాయి పెంచడానికి ఏం చేయాలో మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా ఆ నిధులను ఖర్చు చేయింది. చిత్తూరు నడిబొడ్డున ఉన్న గాంధీ విగ్రహం వద్ద పచ్చని మొక్కలతో ఓ ఉద్యానవనాన్ని నిర్మించారు. అలాగే ఎంఎస్ఆర్ కూడలి, గంగినేనిచెరువు ప్రాంతాల్లో మొక్కలు నాటడం ద్వారా వాహనాల ద్వారా వెలువడే కాలుష్యాన్ని కొంత శుద్ధి చేసినట్లయ్యింది. అలాగే షర్మన్ పాఠశాల నుంచి కలెక్టర్ బంగ్లా వరకు రోడ్డు విస్తరణ, మురుగానిపల్లె వద్ద కొత్త రోడ్డు నిర్మాణం ద్వారా ట్రాఫిక్ మళ్లించడం లాంటి పనులకు ఈ నిధులు ఖర్చు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. తాజాగా ఎన్-కాప్ విడుదల చేసిన 2023-24లో నమోదైన వాతావరణ కాలుష్యం డేటా ప్రకారం చిత్తూరు నగరానికి దేశ స్థాయిలో 116వ ర్యాంకు లభించింది. అంటే కాలుష్యం పెరుగుదలలో పీఎం 10 (వాతావరణంలో పీల్చుకునే స్థాయిలో ఉండే 10 మైక్రోమీటర్ల వ్యాసం కలిగిన ముతక కణాలు) స్థాయి 62 నుంచి 59 పాయింట్లకు తగ్గినట్లు ప్రకటించారు.



చిత్తూరు నగరం చుట్టూ ఉన్న పచ్చదనం (ఏరియల్ వ్యూ)

వృక్ష సంపదే వరం



చిత్తూరు నగర వాసులకు రిజర్వు ఫారెస్టులో దట్టమైన అడవిని తలపించే ఎర్రచందనం వృక్షాలతో పాటు ఇక్కడ వందల సంఖ్యలో ఔషధ గుణాలున్న మొక్కలు ఎన్నో ఉన్నాయి. స్వచ్ఛమైన ప్రాణ వాయువును అందించడంలో, కాలుష్యమైన గాలిని శుద్ధి చేయడంలో ఇవి ఎంతో కీలకపాత్రను పోషిస్తున్నాయి. ఫారెస్టుతో పాటు చిత్తూరు పరిసరాలు పచ్చదనంతో నిండి ఉండటం కూడా కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి ఉపయోగపడుతున్నాయి. అడవుల్లోకి వెళ్లినప్పుడు అక్కడ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం, ప్రకృతికి విఘాతం కలిగించడం ఎట్టి పరిస్థితిల్లోనూ చేయొద్దు. ప్రకృతి సంపదను కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది. ప్రజలు కూడా తరచూ మొక్కలు నాటి సంరక్షించడంలో భాగస్వాములు కావాలి.


– చైతన్యకుమార్ రెడ్డి, డీఎఫ్‌ఓ, చిత్తూరు

పచ్చదనాన్ని కాపాడుకోవాలి



చిత్తూరులో కాలుష్య ఉద్గారాలు తగ్గడం మంచి విషయం. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాలు ఉపయోగించే వాహనాల సంఖ్య తగ్గిస్తూ వస్తేనే మనకు భవిష్యత్తు, పర్యావరణం బాగుంటుంది. విద్యుత్‌తో నడిచే స్కూటర్లు ఈ మధ్య బాగానే ఉపయోగిస్తున్నారు. సహజ సిద్ధమైన వృక్ష సంపదను కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనిని గుర్తెరిగి ప్రజలు బాధ్యతతో మెలగాలి. పచ్చదనాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ రావాలి.

– మురళి, ప్రకృతి ప్రేమికుడు, చిత్తూరు



చిత్తూరు నగరం చుట్టూ ఉన్న పచ్చదనం

చిత్తూరంతా పచ్చదనమే

దీనికితోడు చిత్తూరు నగరం చుట్టూ ఉన్న పచ్చదనం కూడా స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. అడవుల మధ్య ఓ నగర ఉన్నట్లు తలపించే చిత్తూరులో రిజర్వు ఫారెస్టులో 151 హెక్టార్ల విస్తీర్ణం ఎర్రచందనం చెట్లు ఉండటం వల్ల ఇది భూతాపాన్ని తగ్గించడంతో ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఎర్రచందనంలో ఉన్న 'టీరోకార్పస్ సాంటాలినస్' అనే ఔషధం ఉండటం, ఇది గాల్లో కలవడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించే పరిమాణాన్ని పెంచుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గతంలోనూ గుర్తింపు

2018లో అమెరికాలోని చికాగో యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ బిహేవల్ సైన్స్ విభాగంలో అధ్యాపకులుగా ఉన్న డాక్టర్ థామస్ తల్‌హెల్మ్ అనే శాస్త్రవేత్త ఓ సర్వే నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌ఓ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) సూచీ ఆధారంగా థామస్ తన వద్ద ఉన్న పరికరాలు, తనకు తెలిసిన వ్యక్తుల సాయంతో 'స్మార్ట్ ఎయిర్' అనే సంస్థ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రాణవాయువు ఎక్కువ కలుషితం కాకుండా ఉంటుందో తెలుసుకునేందుకు సర్వే చేశారు. భారత్‌లో స్వచ్ఛమైన వాయువు దొరికే నగరాల్లో చిత్తూరుకు నాలుగో స్థానం దక్కినట్లు ప్రకటించారు.



చిత్తూరు-వేలూరు మార్గంలో గాలి స్వచ్ఛత లభిస్తున్న తీరును తెలిపే డిజిటల్ బోర్డు

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు పరిశీలన

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఈనెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవానికి ముస్తాబవుతున్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. మంగళవారం పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ మణికంఠతో కలిసి ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 78వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో పతాకావిష్కరణకు ముఖ్య అతిథిగా వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ హాజరవుతారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం సీట్ల ఏర్పాటు, సభా స్థల ముస్తాబు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, సాంస్కృతి కార్యక్రమాలు లాంటి వాటిని ఇప్పటికే పనులు అప్పగించిన ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ ఆరీఫుల్లా, డ్వామా పీడీ రాజశేఖర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ పాల్గొన్నారు.



సభాస్థలి వద్ద ఏర్పాట్లపై ఎస్పీతో మాట్లాడుతున్న కలెక్టర్

బిందు, తుంపర్ల సేద్యంపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బిందు,తుంపర్ల సేద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 100 రోజుల ప్రణాళిక అంశంపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 21,000 హెక్టార్లు కాగా వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో 3,500 హెక్టార్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ వేగవంతం చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సచివాలయాల్లో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్లు సమష్టిగా లక్ష్యాలను అధిగమించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విన్యాసాల ప్రయాణం గురూ..!

ఇక్కడ చిత్రాన్ని చూస్తుంటే ఏమనిపిస్తోంది..? ఓర్నీ దుంపతెగా!.. ఇంతమందిని ఎక్కించుకుని ఎట్లా పోతున్నార్రా సామీ..ఆశ్చర్యపోతున్నారు కదూ..! అవును మరి. సాధారణంగా బైక్‌పై ఇద్దరో ముగ్గురో వెళ్తుంటారు. ఇక ట్రిపుల్ రైడింగ్‌లో పోలీసులకు పట్టుబడితే జరిమానా వాత తప్పదు. అలాంటిది ఏకంగా ఏడుగురితో ఎక్స్‌ఎల్ మోపెడ్ దూసుకుపోతూ గంగవరం హైవేపై కనిపించింది. వీరంతా గంగవరం నుంచి పలమనేరు వరకూ ప్రయాణించారు. వీళ్ల విన్యాసాల ప్రయాణం చూసి వాహనచోదకులు ఆశ్చర్యంగా చూశారు. ఒరేయ్..జాగ్రత్తరోయ్..అంటూ హెచ్చరించారు.

–గంగవరం

సమైక్యత, జాతీయవాదంతో ముందుకు..

- ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- నగరంలోని పలు ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ :ఇంటింటా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం నగరంలోని గాంధీ సర్కిల్, సంతపేట, కొంగారెడ్డిపల్లె ప్రాంతాల్లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద 2కే రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ దర్గా సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా పీసీఆర్ కాలేజీ వరకు కొనసాగింది. కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దేశ సమగ్రత, సమైక్యత, జాతీయవాదం పెంపొందించేలా ప్రోత్సహించాలన్నారు. ర్యాలీలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, డీఈఓ దేవరాజు, డీవీఈఓ సయ్యద్ మౌలా, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, క్రీడాకారులు, వివిధ స్కూళ్లు, కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

సంతపేటలో..

నగరంలోని సంతపేటలో జనజాగృతి సంస్థ, కొంగారెడ్డిపల్లెలో ఏవీఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల మోహన్, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం కొంగారెడ్డిపల్లె నుంచి గాంధీ విగ్రహం వరకు 500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, రామభద్ర, మస్తాన్, అఖిల్, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

రన్‌కు అతితక్కువ మంది!

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విద్యా శాఖ, ఇంటర్ విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7.45 గంటలకు చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద నుంచి 2కే రన్ నిర్వహించాలని ముందస్తుగా జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అయితే రన్‌కు ఉదయం 8 అవుతున్నా క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్దగా హాజరు కాలేదు. కలెక్టర్ నిర్ణీత షెడ్యూలికే ఇక్కడికి వచ్చారు. దీంతో అధికారులు అప్పటికప్పుడు హడావిడిగా విద్యార్థులను తీసుకువచ్చారు. రన్ గురించి అధికారులు ప్రచారం కల్పించకపోవడం కొట్టొచ్చినట్లు కనిపించింది.

సెప్టెంబర్ నుంచి రెవెన్యూ సదస్సులు

- 45 రోజుల పాటు నిర్వహణ
- 822 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుడుతున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. మొదటి ప్రాధాన్యతగా జిల్లాలోని 31 మండలాల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు సెప్టెంబర్ మొదటి వారం నుంచి 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జిల్లాలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరిలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో గుర్తించినట్లు చెప్పారు.

822 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 822 రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ, సర్వేయర్, దేవదాయశాఖ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొంటారని, తహసీల్దార్లు, ఆర్ఐలు అన్ని రికార్డులతో హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. మ్యుటేషన్లు, వెబ్‌ల్యాండ్ కరెక్షన్లు, 1-బీ, దారి సమస్యలు, భూతగాదాలు, ఆర్ఓఆర్ అప్పీళ్ల ఫిర్యాదులు ఎక్కువగా రావొచ్చని భావిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ప్రజలు ఈ సదస్సుల ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

వాటర్ ప్లాంట్‌లో చోరీ



కొలింపల్లె క్రాసు వద్ద చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె పంచాయతీ కొలింపల్లె క్రాసు వద్ద గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. తాళాలు పగులకొట్టి మోటారు, పిల్లర్లు చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఇది వెలుగులోకి వచ్చింది. స్థానికులు సర్పంచ్ సోని దృష్టికి తీసుకెళ్లారు. చోరీ అయిన పరికరాల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఆమె తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సచివాలయ మహిళా సంరక్షకులు రేణుక సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య

పుంగనూరు: ఉరి వేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలు..పట్టణంలోని మంగళం కాలనీకి చెందిన సుబ్రమణ్యం (48) వ్యసనాలకు బానిసవడంతో అతడి భార్య విసిగి వేసారి పుట్టినింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో సుబ్రమణ్యం మద్యం మత్తులో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

హత్య కేసులో మంగమ్మే నిందితురాలు



నిందితురాలు మంగమ్మ అరెస్ట్ చూపుతున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు: తాపీ మేస్త్రీ మొగిలీశ్వర్ హత్య కేసులో మంగమ్మే నిందితురాలని పట్టణ సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పట్టణంలో ఆదివారం మొగిలీశ్వర్ హత్యకు గురవడం విదితమే. కొంతకాలంగా లక్ష్మీనగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఇద్దరూ కాపురముంటూ ఆదివారం రాత్రి జరిగిన గొడవలో చాకుతో మొగిలీశ్వర్‌ను మంగమ్మే హత్య చేసిందని, నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఆయన తెలిపారు.

రూ.5 కోట్లు కట్టు.. ఇసుక కొల్లగొట్టు!



పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నాలుగు రోజులుగా నిలిచి ఉన్న వాహనాలు

- ఇసుకాసురులకు ఓ ఎమ్మెల్యే బంపర్ ఆఫర్
- అడిగినంత చెల్లిస్తే అనుమతులు
- ఊరూరా కూటమి నేతల అక్రమ ఇసుక రీచ్‌లు
- భారీ యంత్రాలతో విచ్చలవిడిగా తవ్వకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అక్రమంగా ఇసుకను తవ్వి తరలించుకునేందుకు జిల్లాలోని ఓ ఎమ్మెల్యే బంపర్ ఆఫర్ ప్రకటించారు. నెలకు రూ.5 కోట్లు చెల్లించిన వారికి నియోజక వర్గంలో ఎక్కడైనా తవ్వుకుని విక్రయించి సొమ్ముచేసుకునేందుకు అనధికారికంగా అనుమతులు ఇస్తున్నారు. ఒక ఎమ్మెల్యే ఇసుక దందా గురించి తెలుసుకున్న మిగిలిన శాసనసభ్యులు సైతం అదే దారిలో నడుస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గత నెల 8వ తేదీన తిరుపతి జిల్లాలో వెంకటగిరి మండలం మొగళ్లగుంట, దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు, నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ, పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు, చిత్తూరు జిల్లాలో గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండలం దిగుమాసపల్లె, పాలూరులో అధికారిక ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో కేవలం మూడు రీచ్‌లలో మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. మిగిలిన నాలుగు రీచ్‌లు ఇసుక నిల్వలు లేక వెలవెలబోతున్నాయి.

ప్రకృతి వనరులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు కాసులకు కక్కుర్తిపడుతున్నారు. ముఖ్యంగా ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. అడిగినంత చెల్లిస్తే వెంటనే తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని కూటమి నేతలకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. రూ.5కోట్లు ఇస్తే ఇష్టారాజ్యంగా ఇసుక కొల్లగొట్టుకోవచ్చని నిస్సిగ్గుగా ప్రకటించేశారు. ఈ మేరకు ముడుపులు అందుకుని అనధికార రీచ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తున్నారు. సదరు ఎమ్మెల్యే దందా తెలుసుకున్న ఇతర శాసనసభ్యులు సైతం ఇదే బాటలో నడిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇసుకాసురులతో కలిసి సై'ఖతం' చేసేందుకు వెంపర్లాడుతున్నారు.

తప్పని పడిగాపులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఇసుక రీచ్‌లు అక్రమాలకు నిలయంగా మారిపోయాయి. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన అనధికార రీచ్‌లలో ఇసుకను అమ్ముకునేందుకు ప్రభుత్వ రీచ్‌లను పావుగా వాడుకుంటున్నారు. రెవెన్యూ అధికారులను మామూళ్ల మత్తులో ముంచి ఇసుక లోడ్ చేయకుండా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నాలుగు రోజులుగా సుమారు 400 పైగా టిప్పర్లు, ట్రాక్టర్లు బారులు తీరి ఉన్నాయి. టిప్పర్‌కు అదనంగా రూ.2వేల లెక్కన అధికారులు వసూలు చేశారు. అయినప్పటికీ టీడీపీ నేతల నుంచి అనుమతులు రాకపోవడంతో వాహనాలకు ఇసుక లోడ్ చేయలేదు. దీంతో వాహనాల యజమానులు, డ్రైవర్లు తిండీ తిప్పలు కూడా లేకుండా నాలుగు రోజులగా రీచ్ వద్దే పడిగాపులు కాస్తున్నారు.

అధికారులతో కుమ్మక్కై..!

ఇసుక అక్రమ రవాణా ద్వారా భారీగా డబ్బులు సంపాదించుకునేందుకు కూటమి నేతలు పథకం వేశారు. ముందుగా సంబంధిత అధికారులతో కుమ్మక్కైయ్యారు. అధికారిక రీచ్‌లలో ఇసుకను డంప్ చేయకుండా ఆపేయాలని లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలోనే సుమారు 15 రోజులుగా రీచ్‌లలో ఇసుక డంప్ చేయటం మానేశారు. ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన ఓ బీజేపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుని కుమారుడు తొలుత టీడీపీ ఎమ్మెల్యేలను కలిశాడు. ఇసుక తవ్వుకుంటామని, ఎంతో కొంత సమర్పించుకుంటానని చెప్పుకున్నాడు. తిరుపతి జిల్లా పరిధిలో విస్తారంగా ఇసుక లభ్యమయ్యే ప్రాంతానికి చెందిన ఓ ఎమ్మెల్యే వెంటనే సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ప్రతి నెలా రూ.5 కోట్లు చెల్లిస్తే నియోజక వర్గంలో ఎక్కడైనా, ఎంతైనా తవ్వుకుని అమ్ముకోవచ్చని చెప్పారు. ఎమ్మెల్యే ఆఫర్‌కి ఇసుకాసురుడు వెంటనే ఓకే చెప్పాడు.

వెలసిన అనధికార రీచ్‌లు

ఎమ్మెల్యే అనుమతి ఇవ్వడంతో సదరు నియోజకవర్గంలో ఇసుకాసురుడు అనధికారికంగా సుమారు 100 రీచ్‌లు ఏర్పాటు చేశాడు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వేసి ప్రతి రోజూ వందల వాహనాల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నాడు. కంటైనర్ల ద్వారా కూడా చెన్నై, బెంగుళూరుకు సైతం తరలించి జేబులు నింపుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన ఎమ్మెల్యేల్లో కొందరు అదే తరహాలో బేరం పెట్టారు. ఇప్పటికి నాలుగు నియోజక వర్గాల్లో మాత్రం బేరం కుదరడంతో అక్రమ రీచ్‌లు వెలిశాయి. గంటకు మూడు కంటైనర్లు, ఆరు టిప్పర్ల చొప్పున ఇసుక తరలింపు సాగుతోంది. మొత్తం వ్యవహారంలో సంబంధిత అధికారులకు వాటాలు వెళుతున్నాయని, అందుకే మీడియాలో కథనాలు వస్తున్నా స్పందించడం లేదని తెలుస్తోంది.

ట్రాక్టర్లను పట్టేసి.. టిప్పర్లను వదిలేసి!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రెవెన్యూ, పోలీస్, సెబ్ అధికారులు సామాన్యులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. కూటమి నేతల అక్రమాలపై కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించడం లేదు. మంగళవారం జరిగిన ఓ ఘటనే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. శ్రీకాళహస్తి మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.5వేల చొప్పున జరిమానా విధించి విడుదల చేశారు. అయితే తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, పెన్నలపాడులో కొందరు టీడీపీ నేతలు జేసీబీల ద్వారా టిప్పర్లకు ఇసుక లోడ్ చేసి తరలిస్తుంటే మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ తవ్విన ఇసుకను వేర్వేరు ప్రాంతాల్లో డంప్ చేసి, రాత్రి వేళల్లో లారీల్లో నింపి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. దీనిపై మాత్రం అధికారులు స్పందించడం లేదు. స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్ ఇసుక కావాలంటే టీడీపీ నేతలు అనధికారికంగా రూ.1,100 వసూలు చేస్తున్నారు. దీనిపై తొట్టంబేడు తహసీల్దార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం విశేషం.

డిజిటలైజేషన్ వేగవంతం చేయండి

సింగిల్‌విండో కార్యాలయం తనిఖీలో కలెక్టర్ ఆదేశం

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు సింగిల్‌విండో కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులు, రుణ గ్రహీతల వివరాలు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి కేవైసీ, ఆధార్ , ఫోన్ నంబర్, భూముల వివరాలు అయా మండలాల్లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ సచివాలయ అధికారులు ద్వారా వివరాలు సేకరించి కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. గంగాధరనెల్లూరు మండల సొసైటీలో 7,525 మంది రైతులకు గాను 1,725 లకు చెందిన వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్, డీజీఎం వెంకటా చలపతి, ఆప్కాబ్ సీనియర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ చీఫ్, తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ తులసీరాం, మేనేజర్లు మహేష్, రమేష్, విజయ, సొసైటీ సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం దంపతుల అరెస్ట్

గంగవరం: గంజాయి స్వాధీనం చేసుకుని దంపతులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా బి. కొత్తకోటకు చెందిన శంకర, అతని భార్య కలిసి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో గంగవరం ఫ్లెక్సైవర్ బ్రిడ్జి వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా రూ.లక్ష విలువ చేసే 9 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జేసీకి వీడ్కోలు సన్మానం

- ఆయన సేవలు మరువలేనివి
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఏడాదికి పైగా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన శ్రీనివాసులు సేవలు మరువలేనివని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. గుంటూరు నగరపాలక కమిషనర్‌గా బదిలీ అయిన జేసీకి మంగళవారం కలెక్టరేట్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆయన సేవలను ప్రస్తుతించారు. విధి నిర్వహణలో చురుకుగా ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు జేసీ పరిష్కరించేవారని, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా ప్రజలకు చేరువ చేశారన్నారు. బదిలీ అయిన జేసీ మాట్లాడుతూ, ఏడాదికి పైగా చిత్తూరు జిల్లాలో పనిచేసిన అనుభవం ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య మాట్లాడారు. ఆయనతో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. జేసీ తమకు మార్గదర్శకులని అన్నారు. అనంతరం జేసీని కలెక్టర్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఏఓ కులశేఖర్, ఆర్డీఓలు మనోజ్‌కుమార్, చిన్నయ్య, శ్రీనివాసరాజు, వెంకట్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈచర్, కారు ఢీ : యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

గంగాధర నెల్లూరు: ఈచర్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని అప్పిరెడ్డికండిగ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం..శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన హర్షవర్ధన్ రెడ్డి, ప్రమోద్, ఆకాశ్ స్నేహితులు. వీరు కొత్తపల్లిమిట్ట నుంచి సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కారులో చిత్తూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో గంగాధరనెల్లూరు మండలం అప్పిరెడ్డి కండిగ బస్టాప్ సమీపంలో ముందు వెళ్తున్న ఈచర్ వాహనం డ్రైవర్ ఎలాంటి లైట్ సిగ్నల్ ఇవ్వకుండా మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి ముందుకెళ్లేందుకు యత్నించాడు. అదే సమయంలో కారు ఆ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వారిని గుర్తించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు గంగాధరనెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెండా ఊంఛా రహే హమారా!



చౌడేపల్లెలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మంగళవారం 500 అడుగుల పొడవు గల జాతీయ పతాకంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరూ పొడవాటి మువ్వన్నెల జెండాను ఆసక్తిగా తిలకించారు. -చౌడేపల్లె

జూనియర్ జడ్జీల బదిలీ

- కొత్త జడ్జీలకు పోస్టింగ్‌లు



మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, శ్రీకాళహస్తి జూనియర్ జడ్జీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ జడ్జీలుగా ఎంపికైన 20 మందికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న జీ.ధర్మారావును విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు బదిలీ చేసింది. అలాగే చిత్తూరు మొబైల్ కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న కీర్తనను మదనపల్లి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. జడ్జి కీర్తన ఈనెల 12వ తేదీ నుంచి అక్టోబర్ 20 వరకు జ్యూడీషియల్ అకాడమీలో శిక్షణ ముగిసిన తర్వాత బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు న్యాయవాదులు జూనియర్ జడ్జీలుగా ఎంపికయ్యారు. వారిలో తిరుపతి, అవిలాలకు చెందిన మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె పాగు శ్రీనాథ్ కుమారుడు పల్లె పాగు ప్రశాంత్‌కు గుంటూరు జిల్లా మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, శ్రీనగర్ కాలనీకి చెందిన ఎం.రోహిత్‌ను విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు నియమించింది. అలాగే విజయనగరం జిల్లా, దాసన్నపేట, శ్రీ జగన్నాథ నగర్‌కు చెందిన కే కృష్ణవంశీని పుంగనూరు జూనియర్ సివిల్ జడ్జిగా, విజయవాడ రూరల్, ఎంకిపాడు, చంద్రబోస్ కాలనీకి చెందిన పీ.వరుణ్ తేజ్‌ను కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించింది. జూనియర్ జడ్జీలు ఈనెల 31వ తేదీ లోపు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించింది. నూతనంగా జూనియర్ జడ్జిలుగా ఎంపికైన వారు మెడికల్ ఆఫీసర్ల వద్ద ఫిట్ నెస్ సర్టిఫికెట్లను పొంది బాధ్యతలు స్వీకరించేటప్పుడు అధికారులకు అందజేయాలని హైకోర్టు సూచించింది.

ఇసుక డంప్ పట్టించాడని దాడి



టీడీపీ నేతల దాడిలో గాయపడిన శివకుమార్

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగుకు చెందిన శివకుమార్(44)పై గ్రామానికి చెందిన కొందరు పచ్చనేతలు దాడి చేశారు. వివరాలు.. ఇసుకను టీడీపీ నాయకులు డంప్ చేశారని శివకుమార్ సమాచారం ఇవ్వడంతో వారు ఆగ్రహించి మంగళవారం దాడి చేశారు. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, నాగరాజరెడ్డి, రాణి తదితరులు తనపై కక్షగట్టి దాడి చేశారని బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

దళితుడని బ్రహ్మోత్సవాల్లో దూరం పెట్టారు

-మున్సిపల్ చైర్మన్ హరి



పుత్తూరు: ద్రౌపదీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ హోదాలో తాను అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉందని, అయితే ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఇతర టీడీపీ నాయకులు తాను దళితుడని పట్టువస్త్రాల కార్యక్రమానికి దూరం పెట్టారని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ద్రౌపదీదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు గత గత కౌన్సిల్ సమావేశంలో రూ.60 వేలు అజెండాలో పొందుపరిచి, తీర్మానించినట్లు చెప్పారు. అయినా మంగళవారం తనను పక్కన పెట్టి ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టువస్త్రాలు సమర్పించారని ఆరోపించారు. కనీసం ఆలయ ఆహ్వాన పత్రికలో తన పేరుగానీ, పురపాలక సంఘం పేరుగానీ ప్రచురించలేదని వాపోయారు. తాను దళితుడనే ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే, దేవస్థానానికి పట్టువస్త్రాలు ఇప్పించకుండా చేశారని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయానికి, పురపాలక, దేవదాయ శాఖ అధికారులు ప్రొటోకాల్ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని నడిబొడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నించడాన్ని చూస్తుంటే ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

లారీ ఢీకొని జింక మృతి



గుడిపాల: రోడ్డు దాటుతున్న జింకను లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం సాయంత్రం చిత్తూరు-వేలూరు రహదారిలోని అనుపు వద్ద చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ జింకను స్థానికులు గమనించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకుమారికి సమాచారం చేరవేశారు. అప్పటికే కుక్కల గుంపు జింకను వెంటాడింది. కుక్కలను స్థానికులు తరిమి జింకను కాపాడగలిగారు. అయితే జింక కాళ్లు విరిగిపోవడంతో కొంతసేపటికే మృతి చెందింది. అనంతరం పశువైద్యాధికారుల పోస్టుమార్టం నిర్వహించి జింకను ఖననం చేశారు.

నష్టం మిగిల్చిన భారీ వర్షం



వర్షానికి నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నగరి : భారీవర్షం పలువురికి నష్టాలను మిగిల్చింది. వర్షం మూలాన కలిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నీటి ప్రవాహం తగ్గడంతో ప్రజలు ఇళ్లలో చేరిన బురద మట్టిని తొలగించి శుభ్రం చేసుకునే పనుల్లో పడ్డారు. తహసీల్దార్ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. చింతలపట్టెడ కాలనీలో 69 నివాసాలు, కేజీ కుప్పంలో 9 నివాసాలు, దామరపాకంలో 2 నివాసాలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ఆ కుటుంబాల వారికి ప్రభుత్వం నుంచి సాయానికి నివేదికలు పంపారు. 32 ఎకరాల వరి పంట ప్రాథమికంగా దెబ్బతింది. పొలాల పక్కనే ఉన్న గట్లు తెగి కుంగిపోయాయి. మరోవైపు ఉరుములు, మెరుపులకు ఇన్‌వర్టర్లు, ఫ్యాన్లు, రెగ్యులేటర్లు, టీవీలు, సెటప్ బాక్సులు, అడాప్టర్లు, మోటార్లు కాలిపోయాయి. వీటిని బాగుచేసుకోవడానికి జనం ఎలక్ట్రికల్ షాపులకు క్యూకట్టారు.